ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 19 డిసెంబరు 2024

గంగమ్మను కలుస్తానని మంత్రి నారాలోకేష్ చేసిన ట్వీట్

Lokesh Nara @naralokesh · 4h
కడప జిల్లా, కొండాపురం మండలం, గండ్లూరుకి చెందిన గంగమ్మ బాడుగ ఆటో తోలుతూ, కుటుంబ సభ్యులను పోషిస్తూ ఆదర్శంగా నిలిచింది. గంగమ్మ పట్టుదల, ఆత్మ అవిశ్వాసం నన్నెంతగానో కదిలించింది. ఆమె కష్టాన్ని టీం నా దృష్టికి తెచ్చింది. త్వరలోనే నేను గంగమ్మను కలుస్తాను.

గంగమ్మను త్వరలోనే కలుస్తా

- ఆమె ఆత్మవిశ్వాసం నన్నెంతగానో కదిలించింది
- మంత్రి నారా లోకేశ్ ట్వీట్

కొండాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంగమ్మను త్వరలోనే కలుస్తా.. ఆమె ఆత్మవిశ్వాసం నన్ను ఎంతగానో కదిలించింది అని మంత్రి నారాలోకేశ్ ట్వీట్ చేశారు. వివరాల్లోకెళ్తే..

కొండాపురం మండలం, గండ్లూరు ఎస్టీ కాలనీకి చెందిన పగిడాల గంగమ్మ అలియాస్ ఆటో గంగమ్మ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. తన భర్తకు అనారోగ్యం కావడంతో బాధ్యతలను భుజాన వేసుకొంది. అద్దెకు ఆటో తీసుకొని రోజుకు రూ.300 సంపాదిస్తూ తన భర్తను, పిల్లలను, తోబుట్టువులను, తల్లిదండ్రులను చూసుకుంటోంది. ఈమె పడుతున్న బాధలను గుర్తించిన ఆంధ్రజ్యోతి ఈనెల 15న 'బతుకు భారమై.. ఆటో నడుపుతూ..' అన్న ప్రధాన శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీంతో అధికారులు పరుగున ఆమె నివసిస్తున్న ఇంటి వద్దకు వెళ్లి వివరాలను సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సోషల్ మీడియాలోనూ ఈ విషయం వైరల్ కావడంతో మంత్రి లోకేశ్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా బుధవారం స్పందించారు. 'గంగమ్మ బాడుగ ఆటో తోలుతూ, కుటుంబ సభ్యులను పోషిస్తూ ఆదర్శంగా నిలిచింది. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం నన్నెంతగానో కదిలించింది. ఆమె కష్టాన్ని టీం నా దృష్టికి తెచ్చింది. త్వరలోనే నేను గంగమ్మను కలుస్తాను' అని మంత్రి ఆయన ట్వీట్ చేశారు.

మంత్రి లోకేశ్‌కు, ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు

- గంగమ్మ, గండ్లూరు ఎస్టీ కాలనీ, కొండాపురం

మేం పడుతున్న బాధలను గతంలో ఎవరూ పట్టించుకోలేదు. మొదటి సారిగా మా ఇబ్బందులను ఉన్నది ఉన్నట్లుగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాశారు. ఆ వెంటనే అధికారులు, మీడియా వాళ్లు మా దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చారు. మా కష్టాన్ని మంత్రి నారా లోకేశ్ సార్ దృష్టికి తీసుకెళ్లిన మీడియా అంతటికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. లోకేశ్ సార్ మా కష్టాలను చూసి చలించడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. మాలాంటి వాళ్లను గుర్తించినందుకు మేం ఎప్పటికీ ఆ యనకు రుణపడి ఉంటాం. మమ్మల్ని కలుస్తాననడం నిజంగా అదృష్టం. ఆయన వచ్చి మా కష్టాలు తీరిస్తే, నిజంగా మా జీవితంలో పండుగ రోజు.


తన పిల్లలతో కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న గంగమ్మ

పల్లెల్లో అభివృద్ధి బాటలు

- రూ.75 కోట్లతో సిమెంటు, తారు రోడ్లు, మెటల్ రోడ్లు
- ఈ నెలాఖరుకు పూర్తయ్యే విధంగా లక్ష్యం
- సంక్రాంతికి మునుపే రోడ్లు ప్రారంభమయ్యేందుకు ప్రణాళిక


సీకేదిన్నెలో సీసీరోడ్ల నిర్మాణ పనులను చూస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ద్వారా పల్లెల్లో మళ్లీ మునుపటి విధంగా అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు. అలాంటి గ్రామసీమలను ఐదేళ్ల జగన్ సర్కారు గాలికి వదిలేసింది. వెరశి మట్టిరోడ్లు, బురదగుంటలతో జనం అవస్థలు పడేవారు. ఇంక వర్షం వచ్చినప్పుడు గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైసీపీ పాలనలో పల్లెసీమల్లో పూర్తిగా అభివృద్ధి కుంటుపడింది. కనీసం బ్లీచింగ్ పౌడరు చల్లేందుకు కూడా నిధులు లేకుండా చేసింది. అయితే కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ పల్లెల్లో అభివృద్ధి బాటలు పడుతున్నాయి. అభివృద్ధి పనుల జాతర సాగుతోంది. జిల్లాలో రూ.75 కోట్లతో 994 అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.


ప్రొద్దుటూరు మండలంలోని తాళ్లమాపురంలో నిర్మాణంలో ఉన్న పశువుల షెడ్లు

డిసెంబరు చివరి నాటికి పూర్తి

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు పల్లెపండుగ పేరుతో గత అక్టోబరులో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మెటల్ రోడ్లు, పాఠశాల కాంపౌండు వాల్స్, పశువుల షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో 58.6 కోట్లతో 129 కి.మీ. మేర సీసీ రోడ్ల నిర్మాణం సాగుతున్నాయి. ఇక రూ.9.13 కోట్ల వ్యయంతో 16 కి.మీ మేర తారురోడ్ల నిర్మాణం, రూ.3.62 కోట్లతో 21 కి.మీ. మెటల్‌రోడ్ల నిర్మాణం సాగుతున్నాయి. ఇక 43 పాఠశాలల్లో రూ.2.87 కోట్ల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నారు. ఇక పశువుల షెడ్లను నిర్మిస్తున్నారు.

ముమ్మరంగా పనులు

మొత్తం 994 పనులకు పరిపాలన అనుమతులు ఇవ్వగా 884 పనులు జరుగుతున్నాయి. పల్లెపండుగ పేరుతో చేపట్టిన రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో సంక్రాంతికి మునుపే పనులు పూర్తయిన వాటిని ప్రారంభించేలా చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు సుమారు 506 పనులు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇంకా మంజూరైన పనులు సుమారు 110 పనులు మొదలు కాలేదు. ఈ నెల చివరి నాటికి వందశాతం పనులు పూర్తి కావడం సాధ్యపడదు. సీసీరోడ్లు 80 శాతం పనులు పూర్తయ్యేలా ఉన్నాయి.

పల్లె పండుగలు ప్రారంభిస్తాం..



జిల్లాలో పల్లెపండుగ ప్రారంభోత్సవంలో భాగంగా 994 పనులు చేపట్టాలని నిర్ణయించాం. ఇప్పటికే కొన్ని సీసీ రోడ్లు, ఇతర నిర్మాణాలు చాలమటుకు పూర్తయ్యాయి. ఈ నెలచివరి నాటికి నిర్మాణాలు పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నాం. మళ్లీ పల్లెపండుగ కార్యక్రమంలో పూర్తయిన పనులు ప్రారంభిస్తాం. సంక్రాంతి నాటికి పల్లెలు రోడ్లతో కళకళలాడనున్నాయి.

- బి.ఆదిశేషారెడ్డి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు


చాపాడు మండలం సోమాపురంలో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్లు

రెవెన్యూ సదస్సులో 'సైబర్ క్రైం కాల్' కలకలం! 6



- తమిళనాడు మార్కెట్‌లో భారీ డిమాండ్ 6
- కేజీ రూ.30 నుంచి రూ.70కి పెరుగుదల

రస్తా పొరంబోకు 6
రహదారికి విముక్తి
- దశాబ్దాల ఆక్రమణలకు తెరదించిన కలెక్టరు శ్రీధర్
- ప్రధాన గేటు, ఫెన్సింగ్‌ను వెంటనే తొలగించాలని ఆదేశం



పేలిన గ్యాస్ సిలిండర్.. తప్పిన ప్రమాదం 7

జీజీహెచ్ అభివృద్ధి.. అందరి బాధ్యత : కలెక్టర్

- ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి తనిఖీ
- పలు విభాగాలపై ఆరా


సర్వజన ఆసుపత్రి వైద్యాధికారులతో కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న జిల్లా సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆయన కడప సర్వజన ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పలు విభాగాల్లో కలియతిరిగారు. ఆయా విభాగాలలోని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఐపీ బ్లాక్‌లో పలు విభాగాలను తనిఖీ చేసి, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను, ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి అక్కడి మౌలిక వసతులు, ఎక్విప్‌మెంట్ సదుపాయాల గురించి హెచ్‌ఓడీ, సూపరింటెండెంట్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి బిల్డింగులకు వెళ్లి అక్కడి విభాగాలను, సదుపాయాలను పరిశీలించారు. ఎకో, టుడి, స్కానింగ్ సెంటర్లతో పాటు కార్డియాలజీ, క్యాథ్‌ల్యాబ్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, పోస్టు ఓపీ, రికవరీ వార్డులను తనిఖీ చేసి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం సైకియాట్రిక్ ఆసుపత్రుల బ్లాక్‌లను తనిఖీ చేసి సంబంధిత ల్యాబ్‌లు, పరికరాలు, డీ అడిక్షన్ వార్డు, సదుపాయాలను అలాగే క్యాన్సర్ ఆసుపత్రులను ఓపీ, ఐపీలను పరిశీలించారు.

సర్వజన ఆసుపత్రి సందర్శన అనంతరం జీజీహెచ్ వివిధ విభాగాల అధిపతులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధునాతన వైద్యపరికాలను కలిగిన ఈ ఆసుపత్రిలో వైద్య విభాగాధిపతులు కేవలం వైద్యం వరకే పరిమితం కాకుండా ఆయా విభాగాల్లోని పరికరాల నిర్వహణ, యాజమాన్యంపై కూడా దృష్టి సారించాలని సూచించారు. వైద్యం కోసం వచ్చే ప్రతి పేషంట్‌కు వందశాతం సంతృప్తికర వైద్యసేవలు అందించాలన్నారు. పేషంట్‌కు వైద్యం అందించే విషయంలో ఎలాంటి కొరత రాకుండా ఆసుపత్రి యాజమాన్యం జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, ఏపీవీవీపీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ హిమదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ శ్రీధర్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ శ్వేత, అన్ని విభాగాల వైద్యాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్ కేసులో వైసీపీ నేత అరెస్ట్

- హైదరాబాదులో అదుపులోకి తీసుకున్న పోలీసులు


వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో నిందితుడు గోపాలస్వామి (ఫైల్)

బద్వేలుటౌన్/మైదుకూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేరొకరి భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్న కేసులో వైసీపీ నాయకుడు, బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎర్రగొల్ల గోపాలస్వామిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ బుధవారం మైదుకూరులో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె పొలం సర్వే నెంబరు 1754/2లో 1.2 ఎకరాల భూమిని ఆక్రమించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మేడిమెల సుశీలమ్మ అనే దళిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు విచారించి గత నెల 26వ తేదీ బాధ్యులపై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ప్రధాన నిందితుడు గోపాలస్వామితో పాటు ఇతర నిందితులు పరారీలో ఉన్నారు. సీఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు హైదరాబాదులో గోపాలస్వామిని అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో హాజరు పరచినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో బద్వేల్ అర్బన్ సీఐ రాజగోపాల్ కూడా ఉన్నారు.

కాగా బాధితుల కథనం మేరకు... సుశీలమ్మ మామ వెంకటయ్య పేరున 1963లో 1.2 ఎకరాలకు డీకేటీ పట్టా పొందారు. అనంతరం ఆయన మృతి చెందగా ఆయన కొడుకు, సుశీలమ్మ భర్త రత్నం 2018లో మరణించాడు. అతడి పేరుతో ఫోర్జరీ ఆధార్‌కార్డును ప్రవేశపెట్టి వైసీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి తన డ్రైవర్ లక్ష్మీనారాయణ పేరిట ఫ్రీహోల్డ్ చేయించి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించారు. దీని ఆధారంగా గోపాలస్వామి తన భార్య లక్షుమ్మ పేరిట కొనుగోలు చేసినట్లు చూపించి రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తన పరపతిని ఉపయోగించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు బాధితురాలు న్యాయం చేయాలని కోరడంతో విచారించి నిందితులు గోపాలస్వామి, ఆయన భార్య లక్షుమ్మ, డ్రైవర్ లక్ష్మీనారాయణ, సబ్ రిజిస్ట్రార్ రామలక్షుమ్మలతో పాటు పలువురిపై 420 కేసు నమోదు చేశారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

మామిడి పంటకు బీమా

- ఎకరానికి రూ.2100 ప్రీమియం
- రూ.42 వేలు బీమా వర్తింపు
- ఈ నెలాఖరు వరకు గడువు


మామిడి తోట

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు బీమా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం జీఓ ఎంఎస్ నెంబర్ 98ని విడుదల చేసింది. రాష్ట్రంలో పంటల బీమా పథకాల అమలు సమీక్షించేందుకు వ్యవసాయ ఆర్థిక పౌరసరఫరాల శాఖల మంత్రులతో ఇటీవల కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జూలై 23న నిర్వహించిన ఈ సమావేశంలో 2019 తర్వాత నిలిపివేసిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని పునర్ నిర్మించారు. ఈ పథకం కింద మామిడి పంటను కూడా చేర్చారు. రాష్ట్రంలోని 23జిల్లాలను ఐదు క్లస్టర్లుగా విభజించి రెండువేల హెక్టార్లకు తక్కువ సాగున్న జిల్లాలను ఈ పథకానికి అర్హత లేనట్లు ప్రకటించారు. ఈ క్రమంలో జిల్లాలో 9642 ఎకరాలలో మామిడి పంట సాగులో ఉంది. దీంతో కడప జిల్లాను ఈ పథకం కింద చేర్చారు. జిల్లాలో చక్రాయపేట, వేంపల్లె, వీరపునాయునపల్లె, సిద్దవటం, చింతకొమ్మదిన్నె, ఒంటిమిట్ట మండలాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఒక హెక్టార్‌కు రూ.1.05 లక్షల బీమా వస్తుందన్నారు. ఈ లెక్కన ఎకరానికి రూ.42వేలు వర్తించనుంది. మామిడి పంట పండించే రైతు ఈ పథకానికి అర్హులు. రైతు చెల్లించే ప్రీమియాన్ని బట్టి బీమా వస్తుంది. మన జిల్లాలో వ్యవసాయ బీమా కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే ఏజెన్సీ మామిడి పంట బీమాను అమలు చేయనుంది. ఏడాది డిసెంబరు 15 నుంచి వచ్చే ఏడాది మే 31వరకు రిస్క్ పీరియడ్‌గా పరిగణించనున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



మామిడి పంటలు సాగు చేసిన రైతులు ప్రభుత్వం కల్పించిన బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. అధిక వర్షం వచ్చినా, అకాల వర్షం పడినా, తక్కువ వర్షపాతం నమోదైనా ఈ పంటకు బీమా వర్తిస్తుంది. కావున ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి.

- సుభాషిణి, జిల్లా ఉద్యాన అధికారి

31 వరకు గడువు

మామిడి పంట బీమాకు ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెలాఖరు నాటికి ముగియనుంది. హెక్టార్‌కు 15 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉండగా అందులో రాష్ట్ర ప్రభుత్వం ఐదు శాతం, కేంద్ర ప్రభుత్వం ఐదు శాతం చెల్లిస్తుంది. మిగిలిన ఐదు శాతం రైతు వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు ద్వారా రుణం పొందిన రైతులు ప్రీమియం నమోదు చేయించుకోవచ్చు. రుణం పొందని రైతులు సాధారణ సేవా కేంద్రాలు (సీఎస్‌సీ) ద్వారా ప్రీమియం చెల్లించవచ్చు. నిర్ణీత గడువులో ప్రీమియం చెల్లించిన వారికే బీమా వర్తించనుంది.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ఓ దేశవ్యాప్త సర్వే

- 13 జిల్లాల అధికారులకు శిక్షణ
- ఎన్ఎస్ఓ ప్రాంతీయ సంచాలకుడు అనిత పార్థసారథి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న అనిత పార్థసారథి

కడప కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించి ప్రపంచ స్థాయిలో దేశాన్ని ఉన్నత స్థానంలో నిలపడమే లక్ష్యంగా వికసిత భారత్-2047 ప్రచారంలో భాగంగా కేంద్ర మంత్రిత్వ శాఖ అవసరాలకు అనుగుణంగా ఆరోగ్య రంగంపై దేశవ్యాప్త సర్వే చేపట్టిందని ఎన్ఎస్ఓ దక్షిణ ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు అనితా పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో 13 జిల్లాల క్షేత్రస్థాయి సిబ్బందికి 18, 19 తేదీలలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సంచాలకులు మాట్లాడుతూ అన్ని రంగాల్లో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించి ప్రపంచ స్థాయిలో ఉన్నత స్థానంలో నిలిపేందుకు కేంద్రం ఆరోగ్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. భారత ప్రభుత్వం జాతీయ గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2025 జనవరి నుంచి ఏడాది కాలంపాటు దేశవ్యాప్త సర్వే చేపట్టనుందన్నారు. ఈ సర్వేలో శిక్షణ పొందిన ఎన్ఎస్ఎస్ఓ క్షేత్ర సిబ్బంది సైద్ధాంతికంగా ఎన్నుకోబడిన గ్రామాలు, పట్టణాలు సందర్శించి వైద్య సంరక్షణ కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శిస్తున్నట్లు తెలిపారు. అక్కడ ప్రజల అవసరాలను బట్టి వివరాలను సేకరిస్తామన్నారు. ప్రజల జీవన వ్యయంపై తీవ్ర ప్రభావం చూపుతూ పెరుగుతున్న వైద్య ఖర్చులు సామాన్యుడికి అందడం లేదన్నారు. కాగా రీసర్వే విధి విధానాలు వైద్య సంబంధ విషయాలను నమోదు చేయడంలో పాటించాల్సిన మెళకువలను సిబ్బందికి శిక్షణ ద్వారా వివరించడం జరుగుతోందని ప్రాంతీయ సహాయ సంచాలకుడు గంపా శ్రీనివాసరావు వివరించగా, స్వల్పకాలిక, దీర్ఘకాలిక జబ్బులు, వాటి లక్షణాలు, వివిధ ప్రభుత్వ వైద్య సదుపాయాల వివరాలను జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా కార్యక్రమ నిర్వ హణాధికారి డాక్టర్ నాగశశిభూషణ్‌రెడ్డి వివరించారు.

వంగ రైతుల పంట పండింది



మార్కెట్‌కు తరలించేందుకు సంచుల్లో నింపుతున్న కాయలు

- పెరిగిన వంకాయల ధరలు
- తమిళనాడు మార్కెట్‌లో భారీ డిమాండ్
- కేజీ రూ.30 నుంచి రూ.70కి పెరుగుదల
- ధరలు ఇలాగే కొనసాగితే రైతులకు సిరులు
- ఆనందంలో వంగ రైతులు

ములకలచెరువు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వంగ రైతుల పంట పండింది. చెన్నై మార్కెట్‌లో వంకాయల ధరలు ఆకాశాన్నంటాయి. వారం రోజుల వరకు రూ.25 నుంచి రూ.30 వరకు పలికిన ధర ప్రస్తుతం ఏకంగా రూ.60 నుంచి రూ.70కి చేరాయి. వరుసగా వచ్చిన రెండు తుఫాన్ల కారణంగా కురిసిన భారీ వర్షాలకు తమిళనాడు రాష్ట్రంలో సాగైన వంకాయ పంటలు దెబ్బతిన్నాయి. అలాగే మన ప్రాంతంలో రైతులు టమోటా పంట భారీగా సాగు చేశారు. దీంతో వంగ సాగు భారీగా తగ్గిపోయింది. ఫలితంగా ధరలు పెరగడంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ధరలు ఇలాగే కొనసాగితే రైతులకు కాసుల వర్షం కురవనుంది. టమోటా ధరలు ఏడు నెలల పాటు ఆశాజనకంగా ఉండటంతో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో రికార్డు స్థాయిలో టమోటా పంట సాగైంది. ధరలు ఇలాగే ఉంటాయని భావించి అత్యధిక మంది రైతులు ఇతర పంటల వైపు ఆసక్తి చూపలేదు. దీంతో వంగ పంట సాగు భారీగా తగ్గిపోయింది. నియోజకవర్గంలో ప్రతిఏటా ఈ సమయంలో సుమారు వెయ్యి ఎకరాల వరకు వంగ పంట సాగయ్యేది. ప్రస్తుతం కేవలం వంద ఎకరాలకు పైగా వంగ పంట సాగై దిగుబడి వస్తోంది. ఎకరా వంగ పంట సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.80 లక్షల వరకు ఖర్చు వస్తోంది. ఇక్కడ పండే వంకాయలకు తమిళనాడు రాష్ట్రంలో డిమాండ్ ఉంటుంది. ఈ ప్రాంతంలో పండిన వంకాయలను వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసి చెన్నై మార్కెట్‌కు తరలిస్తారు. అలాగే పలువురు రైతులు పండిచిన వంకాయలను స్వయంగా వారే చెన్నైకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. ఇక్కడి వంకాయలకు డిమాండ్ ఉంటే తమిళనాడు రాష్ట్రంలో ఈనెలలో వరుసగా వచ్చిన రెండు తుఫాన్ల కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. దీంతో అక్కడ సాగైన వంగ పంట పూర్తిగా దెబ్బతింది. ఫలితంగా ధరలు భారీగా పెరగడానికి కారణమైంది. దీంతో రెండు రోజుల క్రితం చెన్నై మార్కెట్‌లో ఉజాల రకం వంకాయలు కేజీ రూ.60 నుంచి 70 వరకు పలికాయి. అలాగే రెండో రకం వంకాయలు రూ.50 వరకు పలికాయి. ములకలచెరువు మండలం పాత గూడుపల్లెకు చెందిన రైతులు రాజారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు ఉజాల రకం వంకాయలను చెన్నై మార్కెట్‌కు తరలించగా కేజీ రూ.70 పలికింది.



చెట్లలోని వంకాయలు



ములకలచెరువు మండలం చెరువుకిందపల్లె సమీపంలో సాగైన వంకాయ తోట

పది ఎకరాల్లో వంగ సాగు చేశా

- ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వంగ రైతు, పాత గూడుపల్లె



పది ఎకరాల్లో ఉజాల వంగ పంట సాగు చేశాను. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం ఏడు ఎకరాల్లో వంకాయలు దిగుబడి వస్తున్నాయి. వారం రోజుల వరకు కేజీ రూ.30 వరకు పలికిన ధర ఒక్కసారిగా పెరిగిపోయింది. కోత విధించి నాలుగు టన్నుల కాయలను సోమవారం సాయంత్రం చెన్నై మార్కెట్‌కు తరలించాను. అక్కడ కేజీ రూ.70 చొప్పున పలికింది.

ఉరుసులో చట్టాన్ని ఉల్లంఘించరాదు

- పీస్ కమిటీ సమావేశంలో సబ్‌కలెక్టర్



మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లెటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలం కలిచెర్ల వద్ద మౌలా కా పహాడ్ ఉరుసు ఉత్సవాల నిర్వహణలో చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తారని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో కడప అమీన్‌పీర్ దర్గా (పెద్ద దర్గా) పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేనీ వర్గం వారు, కలిచెర్ల మౌలా కా పహాడ్ పీఠాధిపతి హైదరాబాద్‌కు చెందిన అన్సారుల్ హక్ వర్గాలకు చెందిన వారితో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్సారుల్ హక్ వర్గం ఈనెల 26,27,28 తేదీల్లో కలిచెర్లలో ఉరుసు ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని కడప పెద్ద దర్గా పీఠాధిపతి వర్గం వారు ఆక్షేపించారు. ఈ దర్గాపై సర్వహక్కులు కలిగిన వారే ఉరుసు ఉత్సవాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. అన్సారుల్లాహక్ మాట్లాడుతూ తమ తాతముత్తాతల నుంచి ఈ దర్గాపై తమకు హక్కులు ఉన్నాయని తామే ఉరుసు నిర్వహిస్తామని చెప్పారు. దీనిపై సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఇరువర్గాలు వారి వద్ద ఉన్న దర్గా డాక్యుమెంట్స్ తీసుకురావాలని వాటిని పరిశీలించాకే ఎవరికైనా దర్గా ఉరుసు ఉత్సవాలకు అనుమతిస్తామని తెలిపారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్య మాట్లాడుతూ అనుమతి లేకుండా కలిచెర్ల ఉరుసు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై పోలీసు కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అంతవరకు కలిచెర్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించాలని ములకలచెరువు సీఐ కృష్ణప్ప, పెద్దమండ్యం ఎస్‌ఐలను ఆదేశించారు.

రెవెన్యూ సదస్సులో 'సైబర్ క్రైమ్ కాల్' కలకలం!



ఫోన్ చేసిన నిందితుడు ఇతనే..

కలికిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పారపట్ల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సుకు కలెక్టరు చామకూరి శ్రీధర్ హాజరు కానున్న నేపథ్యంలో సదస్సు వద్ద ఒక సైబర్ క్రైమ్‌కు సంబంధించిన కాల్ కలకలం రేపింది. కలెక్టరు రాక కోసం అంతా ఎదురు చూస్తున్నంతలోనే ఒక రెవెన్యూ అధికారికి వాట్సాప్ కాల్ వచ్చింది. మాట్లాడుతుండగానే ఆయనలో మొదలైన పలువురిలో ఆందోళన పెంచింది. జరిగిన సంభాషణ ఏమిటంటే.. మీ అబ్బాయి (పేరుతో సహా చెప్పాడు) డ్రగ్ కేసులో ఇరుక్కున్నాడు. నేను ఐజీ మాట్లాడుతున్నాను. వెంటనే రూ.50 వేలు పంపాలి. తరువాత మాట్లాడుతాను.. అని. ఆ వెంటనే ఆయన కాల్‌ను హోల్డ్‌లో వుంచి తన కుమారుడికి ఫోన్ చేసి ఎలా వున్నావని అడుగుతూ వచ్చిన కాల్ గురించి వివరిస్తే.. ఇవన్నీ మామూలే పట్టించుకోకండి. కాల్‌కు రెస్పాండ్ కాకండని సలహా ఇచ్చాడు. దీంతో ఆయన ఫోన్ కట్ చేసి అక్కడే వున్న కలికిరి పోలీస్ ఇన్‌స్పెక్టరు రెడ్డిశేఖర్ రెడ్డికి జరిగిన విషయం వివరించాడు. ఇవన్నీ సైబర్ క్రైమ్ వ్యవహారాలని, వీటి విషయంలో జాగ్రత్తగా వుండాలని సీఐ సూచించారు. ఎలాంటి లింకులకు కూడా స్పందించవద్దని చెప్పారు. తరువాత ఆ రెవెన్యూ అధికారి ఫోన్‌ను పరిశీలించగా +92 3352440457 నంబరు నుంచి వచ్చినట్లు గుర్తించారు. ఇది పాకిస్తాన్ నంబరుగా తేలింది. కాగా ఫోన్ చేసిన ఆగంతకుడి స్ర్కీన్ షాట్ ఫోటోను తీసి గూగుల్‌లో వెతగ్గా ఇటీవలి కాలంలో ఈ ఆగంతకుడు చేసిన అనేక మోసాల గురించి ఫోటోలతో సహా బయటపడ్డాయి.

బోరుమోటార్ పగులగొట్టి కేబుల్ వైరు చోరీ



బోరు మోటార్‌ను పగులగొట్టి కేబుల్ వేరు చేసిన దృశ్యం

నిమ్మనపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేబుల్ వైరు దొంగలు ఎతంటి సాహసానికైనా తెగిస్తున్నారు. మూష్టూరు పంచాయతీ యర్రప్పగారిపల్లికి చెందిన రైతు సహదేవ వ్యవసాయ బోరు మోటార్‌ను మూడు రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు పగుల గొట్టి 60మీటర్ల వైరు దొంగలించారు. అంతే కాకుండా 15రోజులుగా గ్రామంలోని వ్యవసాయ బోర్ల వద్ద వున్న స్టార్టర్‌లను, వైర్లను దొంగలించారు, రైతు మాట్లాడుతూ తన వ్యసాయ పొలంలో వరి పంట వేసేందుకు నారు విత్తేందుకు బోరు వద్దకు పోగా అప్పటికే బిగించిన బోరు మోటర్‌ను పగలగొట్టి వేరు చోరీచేశారన్నారు. గతంలో కూడా పలు మార్లు స్టార్టర్లు దొంగలించినట్లు వాపోయాడు. దీంతో బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి దొంగల పట్టుకొని తన కేబుల్ ఇప్పించాలని కోరారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు కోడూరు విద్యార్థి



విద్యార్థి అరవింద్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు

రైల్వేకోడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎస్వీ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థి మోసిన అరవింద్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయుడు పుల్లారావు తెలిపారు. ఈ నెల 14 నుంచి 17 వరకు గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అరవింద్ ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. జనవరి 13, 14 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఆ విద్యార్థిని కళాశాల డైరెక్టర్ వసుంధర, అధ్యాపక బృందం తదితరులు అభినందించారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్లు జైలుశిక్ష

సిద్ధవటం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడు రాష్ట్రానికి చెందిన పొన్నావ్ పళని అనే వ్యక్తికి ఐదేళ్ల జైలు, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ ఓబులేశు తెలిపారు. 2018 అక్టోబరు 15న సిద్ధవటం బీట్‌లోని చంచల చెలమ వద్ద ఎర్రచందనం దుంగలు స్మగ్లింగ్ చేస్తుండగా అప్పటి ఫారెస్ట్ రేంజి అధికారి ప్రసాద్ అతనిని అరెస్ట్ చేసి తిరుపతి రెడ్‌శాండిల్ అడిషనల్ సెషన్స్ కోర్టులో హాజరు పరచగా పై శిక్ష విధిస్తూ బుధవారం జడ్జి తీర్పు ఇచ్చినట్లు వివరించారు.

ఎస్పీడీసీఎల్‌కు రూ.9కోట్ల బకాయిలు

- చేతులు మారిన మిల్లు భూములు
- రికవరీ సాధ్యమేనా..?

మదనపల్లెటౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు అంటేనే 40ఏళ్లకూ పైగా పేరుగాంచింది. అలాంటి స్పిన్నింగ్ మిల్లు లాకౌట్ అయ్యి మూతపడి, కార్మికులు చెల్లాచెదురయ్యారు. ఇపుడు ఈ మిల్లు భూములు బహిరంగ వేలంలో కొన్న వ్యక్తులు, చేతులు మార్చేశారని సమచారం. ఈ మిల్లు నుంచి కార్మికులకు రావాల్సిన బకాయిలు కోర్టుల చుట్టూ తిరిగి వసూలు చేసుకుంటున్నారు. ఫ్యాక్టరీలకు రావాల్సిన బకాయిలు మిల్లును కొనుగోలు చేసిన వారి నుంచి రాబట్టేశారు. కాకపోతే పదేళ్లుగా ఎస్పీడీసీఎల్‌కు స్పిన్నింగ్ మిల్లు నుంచి రావాల్సిన బకాయిల విషయమై అధికారులు ఆలస్యంగా కళ్లు తెరిచారు. ఇప్పుడు ఇక్కడ చూస్తే మిల్లు భవనాలు నేటమట్టం కాక, కేవలం భూములు మాత్రమే వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. దీంతో ఎస్పీడీసీఎల్ అధికారులు హడావుడిగా అక్కడి చేరుకుని నోటీసు బోర్డులు పెట్టారు. బుధవారం మదనపల్లె ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్ ఆధ్వర్యంలో సీటీఎం సమీపంలోని ఎంఎస్ఎం స్పిన్నింగ్ మిల్లు స్థలం వద్ద బోర్డు నాటారు. మిల్లు హెచ్‌టీ కనెక్షన్ మీటర్ నెంబర్ 235 నుంచి రూ.9,08,37,044 బకాయిలు రావాలని నోటీసుబోర్డులో వుంచారు. ఈ బకాయిలు చెల్లించకుంటే ఆస్తులను రికవరీ చేస్తామని, వడ్డీతో సహా ఈ బకాయిలు చెల్లించాలని నోటీసు బోర్డులో వుంచారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ డీఈ సురేంద్రనాయక్ ఏఈ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఎస్ఎం మిల్లు స్థలం ఎదుట నోటీసు బోర్డు ఏర్పాటు చేసిన మదనపల్లె ఎస్పీడీసీఎల్ అధికారులు

వైద్య కళాశాలల నుంచి భారీగా బదిలీలు

- మదనపల్లె, పులివెందుల మెడికల్ కళాశాలల నుంచి ఇతర కళాశాలలకు బదిలీ
- సర్దుబాటు పేరుతో రాష్ట్రంలోని పలు కళాశాలలకు కేటాయింపు

కలికిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె, పులివెందుల వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, అసోసియేటెడ్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను భారీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. ఫేస్-2లో చేపట్టిన ఈ రెండు మెడికల్ కళాశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానందున ఈ ఏడాది అడ్మిషన్లకు మెడికల్ కౌన్సిల్ ఆమోదం తెలపని నేపథ్యంలో ఇక్కడున్న బోధనాపరమైన అధ్యాపకులను ఫేస్-1తో సహా ఇతర పాత కళాశాలల్లో సర్దుబాటు విధానంలో బదిలీ చేసిం ది. మదనపల్లె నుంచి 34 మందిని, పులివెందు ల నుంచి 29 మందిని సర్దుబాటు పేరుతో రాష్ట్రంలోని పలు కళాశాలలకు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధానంతో మొత్తం 121 మందిని బదిలీ చేశారు. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మంగళవారం రెండు వేర్వేరు జీఓలు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు..


రస్తా పొరంబోకు రహదారికి విముక్తి

- దశాబ్దాల ఆక్రమణలకు తెర



రాతి కూసాలు, ముళ్ల కంచెను తొలగిస్తున్న దృశ్యం

కలికిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓ ఆసామి తన భూముల రక్షణకు భారీ గేట్లతో ముఖద్వారం, భూముల చుట్టూ వందలాది రాతి కూసాలతో ముళ్ల కంచె. లోపల ఇల్లు. అన్నీ బాగానే ఉన్నాయి. అయితే అందులో ప్రధానంగా వందలాది మంది రైతులకు ఉపయోగపడాల్సిన పెద్ద రస్తా పొరంబోకు రహదారి కూడా చిక్కుకుపోయింది. అటువైపు వెళ్లాల్సిన రైతులకు ప్రతిబంధకంగా మారింది. దశాబ్దాలుగా ఈ రహదారిని విడిపించుకుని వినియోగించుకోవాలని ప్రయత్నిస్తున్న వారి ఆశలు మాత్రం నెరవేరడం లేదు. అయితే బుధవారం మండలంలోని పారపట్ల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సు ఈ అతి పెద్ద అవాంతరానికి పరిష్కారం చూపించింది. ఈ నేపథ్యంలో తమ గ్రామంలోని సబ్ స్టేషన్ అనుకుని రస్తా పొరంబోకు ఉందని, అటు వైపు వందల ఎకరాలకు వెళ్లాల్సిన రైతులు దాని గుండా వెళ్లకుండా ఓ ఆసామి ఆక్రమించి చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేశారని కొంతమంది రైతులు బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టరు శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరు సర్వేయర్లను, రెవెన్యూ అధికారులతో చర్చించి పూర్వాపరాలు విచారించారు. రస్తా పొరంబోకు రహదారికి పెద్ద గేటు అమర్చిన విషయం వాస్తవమని తేలింది. వెంటనే జేసీబీ ఏర్పాటు చేయాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. తాను వెళ్లేలోగా గేటును దాంతో పాటు ముళ్లకంచెను తొలగించాలని తెలిపారు. సదస్సు ముగిసిన అనంతరం కలెక్టరు సబ్ కలెక్టరును వెంటబెట్టుకుని అక్కడికి మూడు కి.మీ దూరంలో ఉన్న రస్తా పొరంబోకు రహదారి వద్దకు చేరుకున్నారు. గేటు పెట్టిన రహదారిని బంద్ చేసిన మహబూబ్ బాషాను పిలిపించారు. ఇలా చేయడం ఏంటని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గేటును కూలగొట్టాలని ఆదేశించారు. అయితే ఒక్కో గేటు 400 కిలోలున్నాయని, ఒక్కరోజు గడువిస్తే తానే తొలగించేస్తానని అతను కలెక్టరును బతిమలాడాడు. రేపటిలోగా ముళ్లకంచెను కూడా తొలగిస్తామని తహసీల్దారు మహేశ్వరీబాయి చెప్పారు. గేటు తొలగించేందుకు ఒకరోజు గడువిస్తూ ముళ్లకంచెను మాత్రం వెంటనే తొలగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆ తరువాత రెండు గంటల్లోగానే తహసీల్దారు ముళ్ల కంచెను ప్రొక్లైనర్‌తో పూర్తిగా నేలమట్టం చేయించారు. ఎట్టకేలకు రస్తా పొరంబోకు రహదారికి విముక్తి లభించింది. సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని సునిశితంగా పరిశీలించి అప్పటికప్పుడే పరిష్కరించిన కలెక్టరు ప్రశంసలు అందుకున్నారు.



చలమారెడ్డిపల్లె కొండల్లో కమ్ముకున్న పొగమంచు

మంచుకురిసే వేళలో...



జిల్లాలో పొగమంచు కమ్ముకుంటోంది. రోజురోజుకు చలి తీవ్రత పెరగడంతో పిల్లలు, వృద్ధులు వణికిపోతున్నారు. ఉదయం 8 గంటలవుతున్నా పొగమంచు తగ్గక పోవడంతో ఇంట్లో నుంచి బయటకు రావడం లేదు. ఇక బుధవారం కడప నగరంలో పొగమంచు తీవ్రత ఎక్కువైంది. కొన్నిచోట్ల చలిమంటలు వేసుకొని సేద తీరే దృశ్యాలు కనిపించాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీల్లో వెళ్లే వారు పట్టపగలే లైట్లు వేసుకొనే పరిస్థితి కనిపించింది. చలికి నోరులేని పక్షులు అల్లాడిపోయాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



చలికి వణుకుతున్న పక్షులు



కడప నుంచి రాయచోటికి వెళ్లే రోడ్డులో ఫ్లైఓవర్ వద్ద ఉన్న మంచు



చలిమంటల కౌగిలిలో వృద్ధులు

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం : జేసీ


రైతుల సమస్యలను వింటున్న జేసీ అదితిసింగ్

ఎర్రగుంట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి టు వేంపల్లె జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూమి కోల్పోతున్న రైతులందరికీ నిబంధనల ప్రకారం పరిహారం అందించి న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ అధితిసింగ్ తెలిపారు. బుధవారం ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో భూములు కోల్పోతున్న ఐదు గ్రామాల రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా రైతులు తమ అభ్యంతరాలను, సమస్యలను వివరించారు. మార్కెట్ రేటు ప్రకారం భూమి విలువ రూ.కోట్లలో ఉందని.. ప్రభుత్వం తమకిచ్చేది చాలా తక్కువగా ఉందన్నారు. ప్రొద్దుటూరు రోడ్డులో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూముల ధర సెంటు రూ.3 లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఉందని.. ప్రభుత్వం కేవలం ఎకరాకు 15 లక్షలు మాత్రమే ఇస్తామనడం అన్యాయం అన్నారు. దీనిపై పునరాలోచించి తమకు న్యాయం చేయాలని వారు జేసీని కోరారు. పెద్దనపాడులో రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, కలాలు తీసుకుంటున్నారని వాటికి తగ్గట్టుగా పరిహారం ఇవ్వాలని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, తహసీల్దార్ శోభన్ బాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.3 కోట్ల పరిహారం ఇప్పించండి

వేంపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో గతంలో రోడ్డు వెడల్పునకు అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.6కోట్ల పరిహారం ఇచ్చింది.. ప్రస్తుతం ఊరిబయట వెళ్తున్న చాగలమర్రి-రాయచోటి రోడ్డుకు ఎకరాకు రూ.3కోట్లు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ అధితిసింగ్‌కు రైతులు, టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. వేంపల్లె మండల పరిషత్ సభాభవనంలో బుధవారం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో భూములు, స్థలాలు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.16లక్షలు ఉందని, సాధ్యమైనంత వరకు నిబంధనల మేరకు పెంచి పరిహారం ఇస్తామని తెలిపారు. దీనిపై టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరి రైతులకు మేలు చేయాలని కోరారు. ఆర్డీఓ చిన్నయ్య, ఎన్‌హెచ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో రైతులతో సమావేశం

వీరపునాయునిపల్లె, డిసెంబరు 18: ఎన్‌హెచ్-440 చాగలమర్రి టు వేంపల్లె జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూమి కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. బుధవారం స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో రైతులకు సమావేశం అయ్యారు. రహదారిలో భూమిపోయిన ఉరుటూరు, కీర్తిపల్లె, అయ్యవారిపల్లె, లింగాల, గంగిరెడ్డిపల్లె,తంగేడుపల్లె గ్రామాల రైతులతో మాట్లాడారు. భూమి పోయిన రైతులకు వ్యవసాయ భూమికైతే రూ.5.82లక్షలు రోడ్డు సైడ్ భూమికి అయితే రూ.11.90 లక్షలు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీంతో ప్రభుత్వం ఇస్తామంటున్న భూనష్టపరిహారానికి ఎవరికీ ఇష్టం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ లక్ష్మీదేవి, సీఐ చల్లని దొర, ఎస్‌ఐలు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పట్టించుకోకపోవడం దారుణం


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సుంకర రవి

కడప నాగరాజుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొవిడ్-19లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు పణంగా పెట్టి పనిచేసిన పారిశుధ్య కార్మికులను అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నగర కమిటీ అధ్యక్షుడు సుంకర రవి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట కొవిడ్-19, అడిషనల్ కార్మికుల పెండింగ్ వేతనాల కోసం చేస్తున్న నిరసన మూడవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న అధికారులకు వినిపించడం లేదన్నారు. ఇకపై స్పందించకుంటే ఈనెల 23న జరిగే జనరల్ బాడీ మీటింగ్‌ను అడ్డుకుంటామన్నారు. అన్ని రంగాల పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. వెంటనే జీఓ 7 ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంచుపాట తిరుపాల్, కార్యవర్గ సభ్యులు ప్రకాష్, సుంకర కిరణ్‌కుమార్, వడ్లపల్లె శ్రీధర్‌బాబు, కార్మికులు పాల్గొన్నారు.

మైలవరం జలాశయంలో మృతదేహం లభ్యం


వెంకటేష్ (ఫైల్ ఫొటో)

మైలవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయంలో బుధవారం ఊసుగాండ్ల పెద్ద వెంకటేష్ (40) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన పెద్ద వెంకటేష్ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళుతున్నానని భార్యకు చెప్పి వెళ్లాడు. ఎంత వెతికినా దొరకకపోవడంతో జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో వెంకటేష్ భార్య సుమలత ఫిర్యాదు చేసింది. జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం వెంకటేష్ మృతదేహం లభ్యం కావడంతో జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు అప్పజెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి



జమ్మలమడుగు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడే నారాయణనాయక్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని బొమ్మేపల్లె తాండాకు చెందిన నారాయణనాయక్ (35) జమ్మలమడుగు నుంచి ద్విచక్ర వాహనంలో ముద్దనూరు రోడ్డులో వెళుతుండగా రోజా టవర్ ఎదురుగా స్కూలు బస్సును ఓవర్‌టేక్ చేస్తూ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఢీకొని వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో అతనికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా దారిలో మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులుపరిశీలించి కేసు నమోదు చేశారు.

కూతురు కనిపించలేదంటూ ఫిర్యాదు

చెన్నూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె సునంద (26) కనిపించడం లేదంటూ చెన్నూరు అరుంధతీనగర్‌కు చెందిన ఓబులేసు స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. సునంద ఇడుపులపాయి త్రిబుల్ ఐటీలో సర్టిఫికెట్లు తెచ్చుకునేందుకు ఈనెల 5న వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా.. పని కాలేదని.. పని పూర్తి చేసుకుని వస్తానని సమాచారం ఇచ్చింది. ఆ తరువాత ఫోను స్విచ్ఛాఫ్ కావడంతో ఎక్కడికి వెళ్లిందో అర్థం కావడం లేదని.. పోలీసులు విచారించి తమ కుమార్తె ఆచూకీ తెలపాలంటూ సునంద తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


కోడూరు-రెడ్డివారిపల్లె తాత్కాలిక మార్గం దుస్థితి, కోడూరు-గుర్రప్పపాళెం గిరిజన కాలనీ మార్గంలో వెళ్లలేని స్థితి, తూర్పుపల్లె-పిట్టావాండ్లపల్లె మార్గం బంద్ అయిన దృశ్యం

మూడు గ్రామాలకు రాకపోకలు బంద్

- భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు
- పాడైన రహదారులను పునరుద్ధరించక..
- మళ్లీ వాన గండం... ఆందోళనలో పల్లె ప్రజలు

రైల్వేకోడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) రైల్వేకోడూరులో గత సెప్టెంబరు నుంచి పలు దఫాలుగా కురిసిన భారీ వర్షాలకు చాలా గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి పల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కోడూరు-రెడ్డివారిపల్లె, తూర్పుపల్లె-పిట్టావాండ్లపల్లె, కోడూరు-గుర్రప్పపాళెం గ్రామాలకు సుమారు 25 రోజులుగా రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ఆ గ్రామాల ప్రజలు వేరే మార్గాల ద్వారా ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి రైల్వేకోడూరుకు చేరుకుంటున్నారు. రెడ్డివారిపల్లె నుంచి పాడి రైతులు పాలు తీసుకుని రైల్వేకోడూరుకు రావాలంటే రాను పోను సుమారు 10 కిలో మీటర్ల దూరం చుట్టూ తిరిగి చేరుకుంటున్నారు. బ్రిడ్జి నిర్మాణంలో ఉండడం.. తాత్కాలిక రోడ్డు వర్షాలకు ప్రతిసారి కొట్టుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా గుర్రప్పపాళెం గిరిజనులు రెడ్డివారిపల్లె మీదుగా పాటిమీదిపాళెం వచ్చి అక్కడి నుంచి చిట్వేలి రోడ్డుకు చేరుకుని రైల్వేకోడూరుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా తూర్పుపల్లె నుంచి పిట్టావాండ్లపల్లె వెళ్లేదారిలో రెండు నదులు ఉండడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. నీటి ఒరవడి ఎక్కువగా ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాడి రైతులు పాలు తీసుకుని రైల్వేకోడూరుకు రావాలంటే ఎక్కువ సమయం పట్టడమే కాకుండా చాలా దూరం వస్తుందంటున్నారు. అరటి రైతులు కాయలను ఎగుమతి చేసుకోవాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ఇక విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలకు వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. స్కూల్ వ్యాన్లు కూడా ఆయా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. అలాగే రైల్వేకోడూరు నుంచి పై గ్రామాలకు ఎవరైనా వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. ఇక బుధవారం నుంచి వర్ష సూచన ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేసి బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాడి రైతుల కష్టాలు వర్ణనాతీతం



కోడూరు-రెడ్డివారిపాలెం మధ్య 20 రోజుల నుంచి రోడ్డు సౌకర్యం లేక సంబంధాలు తెగిపోయాయి. దీంతో ప్రజలు, రైతులు, విద్యా ర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాడి రైతులు రైల్వేకో డూరుకు పాలు తీసుకెళ్లాలంటే.. నానా అవస్థలు పడుతున్నారు. వేరే మార్గాల ద్వారా చాలా దూరం తిరిగి అనేక వ్యయ ప్రయాలతో ప్రతి రోజు పట్టణానికి చేరుకోవాల్సి వస్తోంది.

-శీకారపు మస్తాన్, రెడ్డివారిపల్లె

అరటి కాయలను తీసుకెళ్లాలంటే..



రెడ్డివారిపల్లె, తూర్పుపల్లె నుంచి పిట్టావాండ్లపల్లె వరకు, గుర్రప్పపాళెం గిరిజనుల ప్రాంతాల్లో అరటి తోటలు ఎక్కువగా సాగులో ఉన్నాయి. రోడ్లు సక్రమంగా లేకపోవడంతో అరటి కాయలను ఆ గ్రామాల నుంచి తీసుకెళ్లాలంటే కష్టంగా ఉంది. ప్రత్యామాయ మార్గాలు సక్రమంగా లేకపోవడంతో లారీలు తోటల్లోకి వెళ్లలేకపోతున్నాయి. దీంతో ఎగుమతులు నిలిచిపోయి రైతులు నష్టపోతున్నారు.

-దేశు క్రిష్టారెడ్డి, అరటి వ్యాపారి, అనంతరాజు పేట

న్యాయవ్యవస్థను ప్రజలకు దూరం చేయడం తగదు

- ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు

కడప రూరల్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కక్షిదారుల వివాదాలను సత్వరం పరిష్కరించడానికి న్యాయవ్యవస్థను ప్రజల ముగ్గిట్లోకి తీసుకురావాల్సిన పాలకులు ప్రజలకు దూరం చేయడం సరికాదని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడులు పేర్కొన్నారు. తిరుపతిలో ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు బుధవారానికి 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలో కాకుండా తిరుపతిలో విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 145ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 145 పుణ్యమా అని రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లా కేంద్రాలలో ఉన్న ఫస్ట్ ఏడీజే కోర్టులలో ఇప్పటి వరకు జరుగుతున్న ఎన్‌డీపీ ఎస్ యాక్టుకు సంబంధించిన కేసులన్నీ జిల్లా కేంద్రాలలో జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే దేశంలో 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని సత్వర పరిష్కారం చేయడానికి మండల స్థాయి వరకు న్యాయస్థానాలను తీసుకొని వెళ్లి ప్రజలకు సత్వర న్యాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీక్షలకు సీపీఎం, ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులతో పాటు బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, నందలూరు బార్‌అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జామవా, జింకా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలవండి

- సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్య సహాయ కోఆర్డినేటర్ అధికారి కల్పన శైల


మాట్లాడుతున్న రాష్ట్ర కోఆర్డినేటర్ కల్పన శైల

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న సౌకర్యాలను సక్రమంగా అందేలా చూడాలని సమగ్రశిక్ష రాష్ట్ర సహిత విద్య సహాయ కోఆర్డినేటర్ అధికారి కల్పన శైల మండల విద్యాశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం కడప నగర శివారులోని గీతం కళాశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల అవసరాలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు విచ్చేసి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బడి బయటఉండే విద్యార్థులందరిని బడిలో చేర్పించాలని, ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వం కల్పించే ప్రతి సౌకర్య అందేలా చూడాలని కోరారు. ఇటీవలే భవిత విద్యార్థులకి ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, అలవెన్స్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. ఒక్క దివ్యాంగున్ని గుర్తించి వారికి సదరం సర్టిఫికెట్ ఇప్పించడంతో పాటు, వారి ప్రగతికి అవసరమైన విద్యా బోధన, ఉపకరణాలు, ఆరోగ్య సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. బడి బయట పిల్లలు అందరు బడిలో ఉండేటట్లు చూడాలని, అందరికి విద్య అందాలని తెలియజేశారు. కార్యక్రమానికి రిమ్స్ సూపరింటెండెంట్ సైక్రియాస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వెంకటరాముడు, క్లినికల్ సైకలాజిస్ట్ లక్ష్మీనారాయణ, అర్లీ చైల్డ్ ఇంటర్వెన్షన్ సెంటర్ డాక్టర్ ఫక్రుద్దీన్, సదరం సర్టిఫికెట్ విభాగాధిపతి నాగయ్యతో పాటు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య హాజరై వివిధ విభాగాలకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కడప ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి, ఏడీ కృష్ణకిషోర్, సహిత విద్య సమన్వయకర్తలు కేశవరెడ్డి, రమణమూర్తి, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో మరింత ప్రగతి సాధించాలి


మాట్లాడుతున్న ఆలపాటి శివయ్య

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం నాణ్యత ప్రమాణాలతో ఉన్నత పనితీరును కనబర్చినప్పటికీ మరింత ప్రగతి దిశగా వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్‌ఓ) ప్రతినిధి హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సీఈఓ ఆలపాటి శివయ్య స్పష్టం చేశారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఐఎస్‌ఓ ప్రతినిధుల బృందం రెండు రోజుల సందర్శన పూర్తయింది. అనంతరం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కుల సచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి అన్ని శాఖల అధిపతులతో సమావేశమయ్యారు. సీఈఓ శివయ్య మాట్లాడుతూ సమగ్ర పరిశీలనలో బృందం దృష్టికి వచ్చిన పలు అంశాలను ప్రస్తావించారు. బోధన, పరిశోధనలు, పరిసరాలు నాణ్యమైనవిగా ఉన్నాయని తెలిపారు. శాఖల వారీగా ఐదు వరకు గ్రేడులు ఇచ్చారు. అక్కడక్కడ రికార్డుల నిర్వహణ మెరుగుకావాల్సి ఉందన్నారు. ప్రతి డాక్యుమెంట్‌కు సంబంధించిన ఆధారం ఫైలింగ్ చేయాలని తెలిపారు. అన్ని శాఖలు బాగా పనిచేస్తున్నాయని ప్రశంసిస్తూనే మరింతగా పనిచేస్తే ఉన్నతమైన న్యాక్ గ్రేడ్‌ను వైవీ యూ సొంతం చేసుకుంటుందన్నారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ ఆడిట్ సుమాదేవి మాట్లాడుతూ వైవీయూ అభివృద్ధికి మెరుగైన సూచనలు చేశారు. ఉపకులపతి ఆచార్య కెకృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడారు. ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ ఎల్ సుబ్రమణ్యశర్మ, ఐక్యూఏసీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుభాష్‌చంద్ర, సభ్యులు, అన్ని శాఖల అధిపతులు పాల్గొన్నారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం.. ఇరువురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వద్ద అధికారులు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన 9550 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు...

బుధవారం బొమ్మవరం గ్రామానికి వెళ్లే మార్గంలో ఆటోలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు అనంతరాజుపేట పంచాయతీ పరిధిలోని ఓ ఇంట్లో అక్రమంగా నిలువ ఉన్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని చంద్ర అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సివిల్ సప్లయిస్ అధికారులు రాంమోహన్, ఆర్.లక్ష్మీదేవి, వీఆర్వో సృజిని, పోలీసులు సుధాకర్ రాజు, బాబుల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్.. తప్పిన ప్రమాదం

కడప(క్రైం), డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రవీంద్రనగర్‌లో బుధవారం రాత్రి ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. రవీంద్రనగర్‌కు చెందిన నందిని భర్త బుధవారం సాయంత్రం అయ్యప్ప కొండకు వెళ్లారు. దీంతో నందిని ఇంట్లో దీపం వెలిగించి సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. దీపం వల్ల ఇంట్లో ఉన్న సిలిండర్ పేలి ఇంటి సామగ్రి కాలిపోయింది. అప్రమత్తమైన చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. సిలిండర్ పేలే సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నడిరోడ్డుపై బర్త్ డే వేడుకలు పోలీసుల అదుపులో యువకులు ?

కడప(క్రైం), డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజారెడ్డివీధిలో బుధవారం రాత్రి ఓ యువకుడు మరి కొందరితో కలిసి నడిరోడ్డుపై జన్మదిన వేడుకలు నిర్వహించారు. రోడ్డుపైనే భారీగా బాణసంచా పేల్చడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వారిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేపు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం

కడప మారుతీనగర్, డిసెంబరు 18, (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమస్యలపై నేరుగా సంబంధిత కడప రీజనల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా ఈనెల 20వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు వారి సమస్యలు, సూచనలు, సలహాలను తమ దృష్టికి తీసుకువచ్చేలా 9959225848 అనే నెంబర్‌కు డయల్ చేసి కానీ, వాట్సాప్ ద్వారా కానీ తెలియపరచాలని కోరారు.

దయగల తల్లీ... దండాలు



చెన్నూరులో మాతమ్మదేవి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

చెన్నూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు తూర్పు దళితవాడలో కొలువై ఉన్న గ్రామ దేవత మాతమ్మదేవి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఎన్నో ఏళ్లుగా అమ్మవారు అక్కడ కొలువై ఉన్నప్పటికీ ఏడాది క్రితం ఆలయాన్ని గ్రామ పెద్దల సహకారంతో నిర్మించి బుధవారం నాటికి ఏడాది పూర్తి కావడంతో ఊరేగింపును కన్నులపండువగా నిర్వహించారు. 'దయగల తల్లీ.. దండాలు' అంటూ భక్తులు అమ్మవారి సేవలో తరలించారు. మూలవిరాట మూర్తికి అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, తప్పెట గుళ్ల తదితరాలు ఏర్పాటు చేశారు. అలాగే పలువురు గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మినుము, శనగ రైతుల ఆశలు ఆవిరి

● మినుముకు పచ్చదోమ, శనగకు బూడిదరంగు తెగుళ్లు

కమలాపురం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నదాత పరిస్థితి గాలిలో దీపంలా మారింది. జూదంలా మారింది. దీయనీయంగా తయారైంది. ఓసారి పంటను తెగుళ్లు బలితీసుకుంటే.. మరోసారి ధరల్లేక పెట్టుబడి కూడా చేతికందకుండా పోతోంది. కమలాపురంలో మినుము, శనగ పైర్ల పరిస్థితి ఇదీ... మినుముకు పచ్చదోమ, శనగకు బూడిదరంగు తెగుళ్లు ఆశించడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో దాదాపు 30 వేల ఎకరాల్లో శనగ, 14 వేల ఎకరాల్లో మినుము సాగు చేసినట్లు సమాచారం. ఆయా పైర్లకు తెగుళ్లు సోకడంతో పండుబారుతున్నాయి. మండలంలోని చిన్నచెప్పలి, చదిపిరాళ్ల, భైనపల్లి, పందిళ్ల పల్లి, రాజుపాళెం, ఎర్రగుడిపాడు, కోగటం, సంబటూరు, పెద్దచెప్పలి గ్రామాల్లో మినుము, శనగ విస్తారంగా సాగు చేశారు. చిన్న చెప్పలిలో మినుముకు తెగులు ఆశించి ఎండిపోతోంది. ఎకరా సాగుకు రూ.25000 ఖర్చు చేసినా ప్రయోజ నం లేదని రైతులు పేర్కొంటున్నారు. కనీసం పెట్టుబడి అయినా వస్తుందో రాదో తెలియని పరిస్థితి. నివారణకు పలు రకాల మందులు పిచికారీ చేస్తున్నా అదుపు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు శనగ రైతులు కూడా తెగుళ్లతో దిగులు పడుతున్నారు. వాతావరణం ఇలాగే ఉంటే పురుగు తాకిడిని నివారించలేమని ఆందోళన చెందుతుందన్నారు.





చిన్నచెప్పలి వద్ద పచ్చదోమ తెగులు ఆశించిన మినుము పైరు... ఎర్రగుడిపాడు వద్ద బూడిదరంగు తెగులుతో దెబ్బతిన్న శనగ పంట

ఏడెకరాల్లో మినుము సాగు చేశా

ఏడు ఎకరాలలో మినుము సాగు చేశా. సాగు చేసిన కొద్ది రోజులకే తెగులు సోకింది. ఎన్ని సార్లు మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. కనీసం పెట్టుబడి అయినా వస్తుందనే నమ్మకం లేదు. ప్రభు త్వం ఆదుకోవాలి.
- పుత్తా మధుసూదన్ రెడ్డి, రైతు



శనగ రైతులను ఆదుకోవాలి

మూడు ఎకరాల్లో శనగ, మూడు ఎకరాల్లో మినుము సాగు చేశా. మొదట్లో పైరు బాగున్నా రానురాను తెగుళ్లతో పంట పూర్తిగా దెబ్బతింది. ఎన్ని రకాల మందులు వాడినా తెగులును నివారించలేకపోతున్నాం. ఖరీఫ్‌లో వర్షాభావంలో పంట పూర్తిగా ఎత్తి పోయింది. రబీలోనైనా పంట చేతికి వస్తుందనే ఆశతో వేయగా ఇప్పుడు తెగులు ఆశించింది.- ఉమామహేశ్వర రెడ్డి, రైతు



పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

చెన్నూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):మండలంలో గృహాలు లేని పేదలు, నిరుపేదలు మధ్యతరగతి వారు పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ లెనిన్‌కుమార్ తెలిపారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం, పీఎంఏవై పథకం కింద ఒక్కో గృహానికి ప్రభుత్వం రూ.4లక్షలు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. పక్కాగృహాలు అవసరమైన వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. స్థల రిజిస్ట్రేషను పత్రాలు, తహసీల్దారు ద్వారా పొందిన అనుబంధపత్రాలు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, భార్యాభర్తల ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంటు ఇవ్వాలన్నారు. ఇవి ఆధార్‌కు లింకు అయి ఉండాలన్నారు.

'జీఓ విడుదల హర్షణీయం'

కడప మారుతీనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సేవలందిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లకు నైట్ ఔట్ అలవెన్స్ చెల్లింపునకు ప్రభుత్వం జీఓ విడుదల చేయడం హర్షణీయమని ఆర్టీసీ కార్మిక పరిషత్ నాయకులు పురుషోత్తం పేర్కొన్నారు. బుధవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీంతో సుమారు 33 వేల మంది ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుందన్నారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం: డీసీసీ

కడప కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి విజయజ్యోతి బుధవార ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెదటి బిల్లులో లోక్‌సభ, అసెంబ్లీకి ఒకే సారి ఎన్నికలు జరగడం, రెండో బిల్లులో పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు జరిగేలా పెట్టడం సరికాదన్నారు. ఈ చర్య రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంపై దాడి అన్నారు. రాజ్యాంగ సవరణ ద్వా రా అసెంబ్లీల అధికారాలను క్షీణింపజేస్తూ ప్ర జల నిర్ణయాధికారాన్ని అణగదొక్కడమే జమి లీ ఎన్నికల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వెంటనే ఈ బిల్లులను ఉప సంహరించు కోవాలని విజయజ్యోతి డిమాండ్ చేశారు.

బాల్యవివాహాలను రూపుమాపాలి

వల్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలను రూపుమాపాలని ప్రముఖ సోషల్ వర్కర్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పెద్దపుత్త జిల్లా పరిషత్ పాఠశాలల బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చెప్పినట్లు చదువుకుంటే మంచి స్థానం చేరుకుంటారన్నారు. బాల్యవివాహాలు ఎక్కడైనా జరిగితే తక్షణం 10982 ఫోన్ చేయవచ్చన్నారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పేదల పెన్షన్ తొలగించేందుకు 'కూటమి' కుట్ర

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి

కమలాపురం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదల పెన్షన్ తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో 3 లక్షల పెన్షన్లు తొలగించిందని, మరో ఐదు లక్షల పెన్షన్లను తొలగించేందుకు టార్గెట్ పెట్టుకుందన్నారు. పెన్షన్ల తొలగింపు కార్యక్రమంలో మండలానికి సంబంధం లేని అధికారులతో పునఃపరిశీలన చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం 66 లక్షలకు పైగా పెన్షన్లు ఇచ్చేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు లక్షల పెన్షన్లలో కోతపెట్టి 63 లక్షల మందికి మాత్రమే ఇస్తోందన్నారు. ఆరు నెలల్లోనే ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.9వేల కోట్లకు పైగా ప్రజలపై భారం మోపాలని చూస్తుందన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 27న కడప ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చెన్నకేశవరెడ్డి, శరత్‌బాబు, మహ్మద్ సాదిక్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సింహాద్రిపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) గ్రామాలు సుస్థిర అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఎంపీడీఓ అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం జరిగింది.

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలి

● అధికారులతో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కోరారు.బుధవారం స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు గతంలో నానా అవస్థలు పడేవారన్నారు. ఏదైనా సమస్య పరిష్కరించాలని కోరుతూ అర్జీ ఇస్తే అది కలెక్టర్ నుంచి ఆర్డీఓకు, ఆర్డీఓ నుంచి తహసీల్దార్‌కు, తహసీల్దార్ నుంచి వీఆర్వోకు ఇలా బదలాయించి చేతులు దులుపుకొనే పరిస్థితి ఉండేదన్నారు. సమస్య పరిష్కారం కాక కోర్టులకు, పోలీస్‌స్టేషన్‌లకు, అధికార పార్టీవర్గాల వద్దకు వెళ్లి సమయాన్ని, డబ్బును వృథా చేసుకునే వారన్నారు. ఇలాంటి రైతుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల పేరుతో కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించకుటే స్థానిక అధికారులే బాధ్యత వహిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారన్నారు. కావున అధికారులు సమస్యను సామరస్యంగా, విబేధాలు లేకుండా చూసేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రతి సదస్సులో 50శాతం మేర సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. మిగిలినవి ఉన్నతాధికారులు పరిష్కరిస్తారని రైతులకు భరోసా ఇచ్చారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో రీసర్వే పేరుతో రైతులను తీవ్ర ఇబ్బందులు పెట్టారన్నారు. దీనివల్ల ఆన్‌లైన్‌లో ఎవరిభూమి వారికి కనిపించకుండా పోయిందన్నారు. రీసర్వేను రద్దు చేశారని, రీసర్వే జరిగిన గ్రామాలలో 1బీ, అడంగల్ సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గత రికార్డుల ప్రకారం సిబ్బందితో చర్చించి 1బీ, అడంగల్ ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు.

ధైర్యంగా ముందుకొస్తే ఏనాడో పరిష్కరించేవాళ్లం

పులివెందుల పట్టణంలోని న్యాక్‌బిల్డింగ్ సమీపంలో 2008లో భూసేకరణ కింద 48 మందికి చెందిన 91.58ఎకరాల డీకేటీ భూమిని ప్రభుత్వం తీసుకుందని ఎమ్మెల్సీకి పలువురు ప్రజలు వివరించారు. అయితే ఇంతవరకు తమకు నష్టపరిహారం ఇవ్వలేదని విన్నవించారు. ప్రస్తుతం తమ భూముల్లో ప్రైవేటు వ్యక్తులు భవనాలు, ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా చట్ట ప్రకారం వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారు. అలాగే విజయభాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం వెనుక 459/1లో 19సెంట్లు, 459/2లో 62సెంట్ల స్థలాన్ని 2019లో కొందరు ఆక్రమించుకున్నారని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరిస్తానని వారికి భరోసా ఇచ్చారు.



పులివెందుల రెవెన్యూ సదస్సులో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

సికెదిన్నె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూమి సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ప్రవేశపెట్టిందని తహసీల్దారు నాగేశ్వరరావు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 19 అర్జీలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చుతామన్నారు. రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సుష్మశ్రీకి కేంద్ర, రాష్ట్ర మంత్రుల ప్రశంసలు

కడప(వినాయకనగర్), డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసి అత్యధిక మార్కులు సాధించిన బండారు సుష్మశ్రీ కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. నగరంలోని పటేల్ రోడ్డులో నివాసముంటున్న ఉపాధ్యాయులు బండారు శ్రీనివాసమూర్తి, నాగకుమారిల కుమార్తె సుష్మశ్రీ ఎంబీబీఎస్‌లో అత్యధిక మార్కులు సాధించి దక్షిణ భారతదేశ వ్యాప్తంగా జరిగిన ఎయిమ్స్ స్నాతకోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న సుష్మశ్రీ

పంట నమోదు తప్పని సరి

సింహాద్రిపురం, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా వనరులకేంద్రం ఉపసంచాలకులు (డీడీఏ) వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బలపనూరులో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై అవగాహన

పులివెందుల టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం బుధవారం ఏవో నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ తెగుళ్లకు తగు మోతాదులో మందులు పిచికారీ చేసుకోవాలని, తద్వారా నివారించవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రహదారి పనులను త్వరగా పూర్తిచేయాలి: ఎంపీ

పులివెందుల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని రోడ్డు రవాణా, హైవే శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ అవినాష్‌రెడ్డి విన్నవించారు. బుధవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రిని ఎంపీ కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని ఎన్‌హెచ్716లో భాకరాపేట నుంచి ప్రకాశం జిల్లాలోని ఎన్‌హెచ్-544డీలో బద్వేల్ ఎన్‌హెచ్-67, పోరుమామిళ్ల ఎన్‌హెచ్-167 మీదుగా బెస్తవారిపేట వరకు 0/0 ఉంచి 140 కిలోమీటర్ వరకు రహదారిని జాతీయ రహదారిగా అప్‌గ్రేడేషన్ చేయాలని కోరారు. కడప - ముద్దనూరు మధ్య ఉన్న రెండు లేన్ల రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా మార్చడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

రెవెన్యూ సదస్సులు రైతులకు వరం



చిలేకాంపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమారి

చక్రాయపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు రైతులకు ఒక వరంలాంటివని, దీన్ని ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. బుధవారం చిలేకాంపల్లెలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1బీ, అడంగల్ రాకున్నా, పాస్‌బుక్కులు లేకపోయినా, వివాదాస్పదభూములు పరిష్కారం కాకున్నా తీర్చేందుకే మీ వద్దకు వచ్చామన్నారు. నారపురెడ్డిగారిపల్లెలో రైతు నారాయణరెడ్డి కుటుంబానికి సంబంధించిన భూ సమస్య గతంలో ఉన్న తహసీల్దార్ నిర్వాకం వల్ల భాగపరిష్కారాలు కాలేదు. అలాంటి సమస్యను తహసీల్దార్ విజయకుమారి పరిష్కరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యలుంటే రాతపూర్వకంగా తెలపాలన్నారు. ఆధార్‌కు లింక్ కాకున్నా, ఫోన్ నెంబర్‌కు లింక్ కాకున్నా, పట్టాదారు పాసుబుక్కులు రాకున్నా పరిష్కారం చూపుతామన్నారు. రెవెన్యూ సిబ్బంది, నాయకులు బాలె రామాంజులరెడ్డి, లోమడ వెంకటరామిరెడ్డి, రైతులు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రతిరోజూ నీటి సరఫరా చేయాలి: కమిషనర్



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజు నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. బుధవారం కడప నగరం ఓల్డ్ మున్సిపల్ కార్యాలయం బుగ్గ కాలనీలో ఇంజనీరింగ్ అధికారులు టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా నిర్మించిన ట్యాంకర్ నుంచి ప్రతి రోజు నగర ప్రజలకు తాగునీటి సరఫరా చేయాలని సూచించారు. పాడైన ట్యాంకులను మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఈఈ ధనలక్ష్మి, డిప్యూటీ సిటీ ప్లానర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన తాత్కాలిక వాయిదా

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ 19 అడిషనల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గత మూడు రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం 24 గంటల ధర్నాకు పిలుపునిచ్చారు. కార్పొరేషన్ వేదిక ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆందోళన చేస్తున్న కార్మికుల వద్దకు కమిషనర్ చేరుకొని కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనితో ఆందోళనను తాత్కాలికంగా విరమింపజేశారు.

విచారణ చేపట్టాలి : టీఎన్ఎస్ఎఫ్



వినతిపత్రం సమర్పిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): యోగి వేమన యూనివర్సిటీ పరిధిలో ఉన్న బీఈడీ కళాశాలల అఫ్లియేషన్‌పై విచారణ చేపట్టాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ డిమాండ్ చేశారు. బుధవారం వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మాకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీఈడీ కళాశాలలకు గతంలో యూనివర్సిటీ అధికారులు బీఈడీ కళాశాలల వ్యవస్థను నాశనం చేశారన్నారు.

తనిఖీలు నిర్వహించాలి: పీడీఎస్‌యూ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నారని, ఆ కళాశాలల్లో ఆకస్మికంగా తనిఖీ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆర్జేడీ రవికి వినతిపత్రం అంద జేశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ శామ్యూల్‌కు వినతిపత్రం సమర్పించారు.

జాగ్రత్తలతో తెగులు నివారణ

కమలాపురం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాగ్రత్తలతో తెగులను నివారించవచ్చని డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. శనగకు పచ్చదోమ, వేరుకుళ్లు తెగులు ఎక్కువగా వస్తాయని, తగినంత మోతాదులో మందులు పిచికారీ చేస్తే నివారించవచ్చన్నారు.

తెలుగు తేనె పలుకుల మేళవింపు ఉగాది



సమావేశంలో మాట్లాడుతున్న మునికుమార్

కడప కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కన్నడ కస్తూరి తెలుగు తేనె పలుకుల మేళవింపు ఉగాది అని తాళపత్ర గ్రంథ లిపి నిపుణుడు నాగదాసరి మునికుమార్ పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్ విశ్వవిద్యాలయంలో బుధవారం 'తెలుగు ఉగాది- యుగాది వైభవం' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కడపకు చెందిన మునికుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై మాట్లాడారు.

రైతులపై తుఫాన్ దాడి..!

వరి, మినుము, శనగ పంటల రైతుల కష్టాలు వర్ణణాతీతం

జమ్మలమడుగు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరుస తుఫాన్ల కారణంగా వరి రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేయడానికి అప్పులు తెచ్చుకుని అనేక మంది రైతులు వరి సాగు చేశారు. రైతులు సాగు చేసి మంచి దిగుబడితో వరి ధాన్యం చేతికొస్తుందని, గిట్టుబాటుధర కూడా ఉంటుందని రైతులు ఆశతో ఎదురు చూశారు. గత నెల నుంచి తీరా పంట చేతికొచ్చే సమయంలో అల్పపీడనాల కారణంగా రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చిందని వాపోతున్నారు. గత నెలలో వర్షం కారణంగ పొలంలోనే వరి నేలవాలి భారీగా నష్టం జరిగింది. అప్పట్లో అధికారులు పొలాలను పరిశీలించి రిపోర్టును అధికారులకు పంపించారు. తర్వాత తుఫాన్ కారణంగా వర్షాలు కురవడం రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. అయినా ఏదో ఒక సమయంలో పంట పొలాల్లో మిషన్లు పెట్టి వరి కోత రాత్రి, పగలు చేసినా చివరకు ధాన్యం తడిసింది. ఆ ధాన్యాన్ని మండలంలోని ఊరూరా రైతులు పొలాల పక్కన, ఇళ్ల వద్ద ఆరబోశారు. అయినా అక్కడక్కడ ధాన్యం తడిసి రైతులకు నష్టం చేకూరింది. అయినా వదలని తుఫాన్ మళ్లీ రెండు రోజులుగా దాడి చేస్తోంది. దీంతో మంగళవారం రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు జమ్మలమడుగులో వర్షం కురిసింది. దీంతో రైతన్నలు ధాన్యం వద్ద రాత్రి పట్టలు కప్పి కాపలా కాశారు. అయినా అక్కడక్కడ ధాన్యంలో వర్షపునీరు చేరింది. కొందరు పట్టలపై నిలిచిన వర్షపునీటిని తొలగించే కార్యక్రమం చేపట్టారు. పొలాల్లో మిషన్లు దిగుబడుతున్నాయి. నాలుగు రోజుల క్రితం వరి పంట పొలంలో కోత కోసినా ఆ ధాన్యాన్ని ఎలాగో


రాజుపాలెం.. తడిచిన మినుము పంట


జమ్మలమడుగు... గొరిగెనూరు రోడ్డులో వరి ధాన్యం తడవకుండా పట్టలు కప్పిన దృశ్యం

రోడ్డుపైకి చేర్చి వర్షం రావడంతో రోడ్డు పక్కనే కొందరు పట్టలు కప్పారు. వరి గడ్డిని పొలంలోనే రైతులు వదిలేశారు. ప్రస్తుతం వరి గడ్డిని అడిగే నాథుడు లేరని, రైతులే ట్రాక్టర్లలో తీసుకుని గ్రామాల్లోకి వెళ్లి కట్ట వరి గడ్డిని విక్రయించాల్సి వస్తోందని రైతులు తెలిపారు. ఇదంతా తుఫాన్, అకాల వర్షం వల్లే రైతుకు తీరని నష్టం జరుగుతోందని వాపోయారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తడిసిన ధాన్యం, రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జమ్మలమడుగు మండలంలో దాదాపు ఇప్పటి వరకు సుమారు 900 ఎకరాల్లో నష్టం జరిగి ఉంటుంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

పెద్దముడియం..: నెల రోజులుగా వరుణదేవుడు తుఫాన్ రూపంలో చేస్తున్న వరుస దాడులతో అన్నదాతలు కకావికలమవుతున్నారు. చేతికొచ్చే దశలో వున్న వరి పంట నేలకొరిగి కర్షకులకు కడగండ్లే మిగిలాయి. మరోవైపు ఏపుగా పెరిగిన కంది పూత రాలిపోయి దిగుబడులపై ప్రభావం చూపుతుంది. అలాగే జొన్న పంట నేలవాలింది. ముఖ్యంగా రైతులు మండలంలో ప్రధాన పంటగా సాగు చేసే శనగ పంట ఆందోళనలో పడ్డారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో మండలంలో శనగ సాగు చేసిన రైతాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మంగళవారంతో కాకుండా బుధవారం కూడా వాతావరణం అలాగే ఉండడంతో ఎక్కడ వానదేవుడు తమ కొంత ముంచుతాడోనని రైతులు ఆందోళన పడుతున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో పులుసు, పూత కాయ దశలో ఉన్న పంటపై తీవ్ర ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన పడుతున్నారు.

వేరుకుళ్లుతో జాగ్రత్త.. అరుణ, ఏవో.

తుఫాన్ ప్రభావంతో శనగ పంట వేరుకుళ్లుతో ఇబ్బంది పెడుతుందని నివారణకు మేరికోజ్, కార్బండిజమ్ మందులను తగు మోతాదులో కలిపిన ద్రావణం పిచికారి చేయాలి. అలాగే మంగళవారం కురిసినఎ వర్షానికి శనగ దెబ్బతినకుండా ఎక్సాకొనజోల్, 19.19.19 మందును తగు మోతాదులో పిచికారీ చేయాలన్నారు.

రాజుపాలెం..: రైతన్నలకు అడుగడుగునా వర్షం ఆటంకపరుస్తోంది. గత తుఫాన్‌కు దెబ్బతిన్న శనగపంటకు కోలుకోకముందే మరో తుఫాన్ మొదలుకావడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఖరీఫ్ సీజనులో అరకొర వర్షాలకు సాగైన పంటలు సరైన దిగుబడి లేక అల్లాడిపోతున్న రైతన్నలకు రబీ పంటలకు సకాలంలో వర్షం పడడుతో ఆశలు రేకెత్తాయి. దీంతో శనగ, జొన్న, మినుము పంటలు సాగు చేసిన రైతన్నలకు వరుస తుఫానుతో కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మండలంలో దాదాపు 12వేల ఎకరాల్లో సాగైన శనగ పంట 50 రోజులు దాటడంతో పూత దశలో ఉంది. పూత దశలోఉన్న పంటకు చలి,మంచు తప్ప వర్షం పడితే పంటంతా పులుసు కారిపోవడంతో దిగుబడి రాదని రైతులు ఆందోళన పడుతున్నారు. మంగళవారం రాత్రి పడిన వర్షానికి శనగ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

తడిచిన వరి ధాన్యం..: వరి కోతలు మొదలుపెట్టారు. అయితే మంగళవారం పడ్డ వర్షానికి రోడ్లపై ఆరబోసిన ధాన్యం అంతా తడిచింది. ఉదయం నుంచి రైతన్నలు ధాన్యం అంతా ఒక వైపు నుంచి ఇంకో వైపునకు మార్చుకోవడమే సరిపోయింది. అదే విధంగా మినుముకూడా కోత దశకు రావడంతో కోతలు కోసి కుప్పలుగా చేసుకున్నవి మొలకలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు తెలుపుతున్నారు.

ఆవేదనలో పత్తి రైతులు

ఖాజీపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించే రైతన్నలకు ఈ ఏడాది కూడా నష్టం మిగిలింది. జులై నెలలో సాగు చేసిన పత్తిపంట ఈ ఏడాది నాలుగు క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదన్నారు. ప్రతి సంవత్సరం 12 నుంచి 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చేదని నకిలీ విత్తనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోకుంటే నష్టం తప్ప లాభం చేకూరదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పంటలను పరిశీలించిన అధికారులు

మండల పరిధిలోని సుంకేసుల, తవ్వారుపల్లె, ఏటూరు ప్రజలు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమేరకు అధికారులను పంపి పరిశీలించారు. ఈ పరిశీలనలో కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ, కడప ఏడీఏ శంకర్‌నాయక్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో 2,500 ఎకరాలు పత్తి పంట సాగు చేశారని పత్తిపంటలో గులాబీ రంగు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తొందరపడి పంటలను తొలగించవద్దని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ఏవో నాగార్జున, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఖాజీపేట...పత్తి పంటను దున్నేస్తున్నరైతన్నలు

నిబంధనలు కాలరాస్తే...
లైసెన్సులను రద్దు చేస్తాం

● మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి



ముఖాముఖి

దువ్వూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం వ్యవసాయానికి పెట్టింది పేరు. కేసీ కెనాల్, తెలుగుగంగ, కుందూ, బోరుబావులు, చెరువుల ఆధారంగా భిన్న పంటలు సాగవుతాయి. మండలంలో వరి పంట అధికంగా సాగవుతుంది. వ్యవసాయ శాఖ రైతులను చైతన్యపరుస్తున్నా రసాయనిక ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు అన్నదాతలను నిలువునా దోపిడీ చేస్తున్నారు. వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉన్నా వీరి వలన రైతులకు ఆశించిన ఫలితాలు దక్కడంలేదు. వ్యాపారులు నిబంధనలు కాలరాస్తే లైసెన్సులు రద్దు చేస్తామంటున్న వ్యవసాయాధికారితో **ముఖాముఖి** ఇలా...

ప్రశ్న: దువ్వూరు మండలంలో సాగునీటి ఆయకట్టు విస్తీర్ణం ఎంత?

జవాబు: కేసీ కాలువ పరిధిలో 8,640 ఎకరాలు, బోరుబావులు, తెలుగుగంగ కింద 2,290 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి.

ప్రశ్న: రైతులకు బీమా సౌకర్యం అవగాహన కల్పనపై కామెంట్?

జవాబు: వ్యవసాయ సిబ్బంది పొలాల్లో తిరుగుతూ రైతులను చైతన్యపరుస్తున్నారు. పంటల బీమా ఆవశ్యకతను తెలుపుతున్నాం. పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ప్రత్యేకించి పంటల బీమాపై విశదీకరిఇస్తున్నారు.

ప్రశ్న: ప్రస్తుతం ఏయే పంటలకు బీమా సౌకర్యం కల్పించారు.

జవాబు: మినుము, పెసర, శనగ, జొన్న, నువ్వుల పంటలకు బీమా సౌకర్యం ఏర్పాటు చేశాం.

ప్రశ్న: మీ సిబ్బంది పనితీరు వారి వల్ల రైతులకు కలుగుతున్న ప్రయోజనాలు?

జవాబు: రైతుసేవా కేంద్రాల ద్వారా వీరు అందుబాటులో ఉంటున్నారు. సబ్సిడీపై విత్తనాలు, రైతులకు అవసరమైన స్ప్రింక్లర్లు, ఇతరత్రా యంత్రాలు, విలువైన సమాచారం అందజేస్తున్నారు.

ప్రశ్న: రసాయనిక ఎరువులు, పురుగు మందులు అధిక ధరలతో వ్యాపారులు విక్రయిస్తున్నారు. దీనిపై మీ కామెంట్.

జవాబు: రైతులు ఫిర్యాదుచేస్తే లైసెన్సులు రద్దుకు సిఫార్సు చేస్తాం.

ప్రశ్న: దువ్వూరులో జైకిసాన్, మన గ్రోమోర్ కేంద్రాల ద్వారా రసాయనిక ఎరువులు బడా రైతులకు కమీషన్లు తీసుకుని లోడ్లు లోడ్లు నెట్టేస్తున్నారనే ఆరోపణలపై మీ స్పందన.

జవాబు: అలాంటి అవకాశంలేదు. నిరూపణ అయితే చర్యలు. వీలైతే కేసులు పెడుతాం.

ప్రశ్న: పొలం పిలుస్తోంది కార్యక్రమం నామమాత్రంగా జరుగుతుందనే దానికి మీరేమంటారు.

జవాబు: సమయానుకూలంగా పొలాలు తిరుగుతున్నాం. చీడపీడలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మాకున్న సమయంలో అంతా తిరగాలంటే సాధ్యం కాదు.

ప్రశ్న: పురుగు మందులు, లోపభూయిష్టమైనవి, అధిక ధరలతో విక్రయిస్తున్నారు. మీకు తెలుసా.

జవాబు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో వీటి ఏర్పాటు జరుగుతుంది. వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో ఇవి ఏర్పాటు అవుతాయి. నిబంధనల ప్రకారమే విక్రయాలు ఉంటాయి. ఏవైనా లోపాలు ఉంటే రైతులు ఫిర్యాదు చేయవచ్చు.

దళితులకు అన్యాయం చేయడం తగదు



ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితులకు ప్రభుత్వ భూములు, ప్రభుత్వ రూముల కేటాయింపులో రిజర్వేషన్లను రద్దు చేసి దళితులకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ విమర్శించారు. బుధవారం ప్రభుత్వ వైఖరికి నిరసనగా శివాలయం సెంటర్ నుంచి టుటౌన్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా సుద్దపల్లి మురళీప్రసాద్, రాయలసీమ ప్రధాన కార్యదర్శి సుద్దపల్లి అరుణ్‌కుమార్, ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడుగా నారాయణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాయలసీమ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాయలసీమ మహిళా అధ్యక్షురాలు నీతు, కేకే కుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


23 నుంచి ధాన్యం కొనుగోళ్లు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఈనెల 23 నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వ రంగం సిద్ధం చేస్తోందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు పి.సురేష్‌రెడ్డి, ఏవో శివశంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కానపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప సివిల్‌సప్లయ్ అధికారులు ఎంఎస్‌పీ రేటు ప్రకారం ధాన్యం కొనుగోలును సోమవారం నుంచి చేపడుతుందని వివరించారు. క్వింటాకు మద్దతు ధర రూ.2,300గా నిర్ణయించినట్లు తెలిపారు. కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చొరవతో కలెక్టర్‌ను ఒప్పించి స్థానికంగానే ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేశారని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

పోరుమామిళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల పంచాయతీలో బెస్తవీధిలో సుమారు రూ.5ల లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్డును సర్పంచ్ యనమల సుధాకర్ బుధవారం ప్రారంభించారు. అలాగే పంచాయతీ కార్యాలయం నుంచి బెస్తవీధిలోని దర్గా వరకు సుమారు రూ.15లక్షలవ్యయంతో సిమెంటు రోడ్డు వేశారు.

తీరు మార్చుకోవాలి : ఎమ్మెల్యే వరద



ప్రొద్దుటూరు,డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో పోటీ చేసి కోట్లు పోగొట్టుకున్నా కూడా అవినీతి రహిత పాలన కోసం నేను పనిచేస్తుంటే పోలీసు ఎక్సైజ్ శాఖలలో కొందరు అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని వారి తీరు మార్చుకోకుంటే మాత్రం వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో మద్యం దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలలో రూములు పెట్టుకుని అక్కడే మద్యం తాగే ఏర్పాటు చేస్తే ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా ఉదయం 10 గంటలకంటే ముందుగా మద్యం దుకాణాలు తెరిస్తే చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఇందుకు కారణం ఎక్సైజ్ అధికారులు లంచాలు తీసుకుని నూతన మద్యం పాలసీకి తూట్లు పొడుస్తే వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. పోలీసు స్టేషన్లలో పోలీసు సిబ్బంది కొందరు అధికారులు అవినీతి కి పాల్పడుతున్నారన్నారు. వారందరి గురించి నావద్ద సమాచారం వుందన్నారు. వారు తీరు మార్చుకోకుంటే మాత్రం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వీఎస్ ముక్తియార్, మాజీ కౌన్సిలర్ ఎర్రన్న, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణగోడలు లేక మడూరు కాలువలో పడిన ఆవు

ప్రొద్దుటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రధాన వర్షపు నీటి కాలువలైన మడూరుకాలువతోపాటు ప్రొద్దుటూరు చానల్ 1, చానల్ 2 తోపాటు దొరసానిపల్లె కాలువలకు రక్షణ గోడలు లేకపోవడంతో తరుచుగా ఆవులు పడుతున్నాయి. మడూరుకాలువలో అయితే కొంతకాలంగా కొందరు మనుషులు పడికూడా మరణించారు. కానీ మున్సిపల్ అధికారులు ప్రధాన కాలువలకు రక్షణ గోడలు నిర్మించటంలేదు.దీంతో తరుచూ ఆవులు పడటం ఇతర జంతువులు పడటంతో మున్సిపల్ శానిటరీ అధికారులు సిబ్బంది వాటిని బయటికుతీసి ప్రాణాలు కాపాడుతున్నారు.కాగా బుధవారం మడూరు కాలువలో ఆవు పడి తీవ్ర ఇబ్బందులు పడుతుంటే స్థానికులు మున్సిపాలిటీకి సమాచారం ఇవ్వడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా సిబ్బందితో ఆవును సురక్షితంగా బయటకు తీసి ప్రాణాలు కాపాడారు.



ఆవులను రోడ్లమీదకు వదిలితే బంధిస్తాం : కమిషనర్

ప్రొద్దుటూరు , డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని రోడ్లపైకి ఆవులను వదిలి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వాటిని బంధిస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున హెచ్చరించారు. బుధవారం పట్టణంలో రోడ్ల పై ట్రాఫిక్‌కు అడ్డంగా తిరుగుతున్న ఆవులను మున్సిపల్ సిబ్బంది పట్టుకుని వాటిని కొర్రపాడు రోడ్డులోని పెట్రోల్ బంకు పక్కన గల మున్సిపల్ స్థలంలో బంధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.


ఆవులను పరిశీలిస్తున్న కమిషనర్

డీసీసీ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డీసీసీ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజరు నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఐదురోడ్ల కూడలిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రహ్మంగారిమఠం శాఖ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అవగాహన కార్యక్రమాన్ని రాయలసీమ జానపద కళాకారుల సంఘం సభ్యులచే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం చిరంజీవి, ప్రశాంత్, వీరేంద్ర, బ్యాంకు మేనేజరు ప్రవీణ్‌కుమార్ ఫీల్డ్ ఆఫీసరు దస్తగిరి, క్యాషియర్ సుధాకర్, సొసైటీ సీఈవో రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రులను కలిసిన రితేష్‌రెడ్డి



బద్వేలుటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడి సహాయ సహకారాలు అందించాలని ఢిల్లీలోని కేంద్రమంత్రులను బుధవారం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి మంత్రులను కలసి విన్నవించారు. కేంద్ర పౌరవిమానశాఖామంత్రి రామ్మోహన్ నాయుడును, రోడ్లు రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరి, కేంద్ర పర్యావరణ, అటవీశాఖామంత్రి భూపేంద్రయాదవ్‌ను కలసి బద్వేలు నియోజకవర్గ సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. వీరితోపాటు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రివర్యులు సత్యప్రకాష్‌ను కలసినట్లు వారు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న బూడిద లారీ

● తప్పిన ప్రమాదం ● రోడ్డు పొడవునా బూడిద

జమ్మలమడుగు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ప్రధాన రోడ్డు ఫుట్‌పాత్‌లు ఆక్రమణతో ఇరుకుగామారింది. బుధవారం ఉదయాన్నే పాత బస్టాండు వైపు నుంచి ప్రొద్దుటూరు వైపునకు వెళ్లే బూడిద లారీ డివైడర్‌ను ఢీకొంది. ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ప్రధాన రోడ్డు పక్కన లారీ డివైడర్‌ను ఢీకొన్న వెంటనే సంబంధిత అధికారులు వెంటనే తొలగించారు. ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా లారీని తొలగించినట్లుగా స్థానికులు తెలిపారు. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం వలన ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. వెంటనే మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, వారి సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి సిబ్బంది ద్వారా నల్లబూడిదను శుభ్రం చేయించారు.

● **ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతోనే ట్రాఫిక్..:** జమ్మలమడుగులో అస్తవ్యస్తంగా మారిన ట్రాఫిక్‌ను నియంత్రణ చేసే అధికారులు కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీకాలువపై ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నా పెద్ద వాహనాలు వెళ్లాలంటే రోడ్డు ఇరుకుగా మారింది. అయినా తోపుడు బండ్లు, ఇతర వ్యాపారులు ఇష్టారాజ్యంగా రోడ్లపైనే వ్యాపారాలు చేస్తున్నా ట్రాఫిక్ అంతరాయం కలుగుతున్నా పోలీసు అధికారులు సరైన చర్యలు తీసుకోవడంలేదని విమర్శలున్నాయి.

మత్స్యకారులకు లైసెన్సులు తప్పనిసరి

కొండాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని మండల కూటమి ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని దత్తాపురం గ్రామంలో మత్స్యకారులకు లైసెన్స్‌ల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. మత్స్యకారులు లైసెన్సులు కలిగి ఉంటేనే అన్ని ప్రభుత్వ పథకాలను పొందుతారని పేర్కొన్నారు. లైసెన్స్‌లు లేకుండా చేపల వేటకు వెళ్లితే చట్టరీత్యా నేరమని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. లైసెన్సులు కలిగి ఉంటేనే ప్రమాద బీమా వర్తిస్తుందని ఎంపీడీవో తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 200 సుమారు మంది మత్స్యకారులు లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకున్నారని ఫిషరీస్ అసిస్టెంట్ మల్లీశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సోమశిల ముంపుప్రాంత నిరుద్యోగులు

బద్వేలుటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు, గోపవరం మండలంలోని సోమశిల ముంపుబాధితులకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ చెంచురామస్వామి నిరుద్యోగులను మోసం చేశారని, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేయాలంటూ బుధవారం వెంకటయ్యనగర్‌లోని రామస్వామి ఇంటి ముందు ధర్నా నిర్వహించి అనంతరం ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. నిరుద్యోగులైన ముంపుబాధితుల ఆశను ఆసరాగా చేసుకొని సుమారు 600మందికిపైగా బాధితుల వద్ద నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరాలు గడిచినా ఇటు ఉద్యోగం రాక, ఇచ్చిన డబ్బులు తిరిగిరాక పట్టించుకోకపోవడంతో బాధితులు ఆవేదన చెంది ఆందోళన చేపట్టారు. రామస్వామి ఇంటి వద్ద నిరసన తెలిపి, అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వచ్చి పోలీస్‌స్టేషన్‌లో తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన చేశారు.